నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | అక్టోబర్ 21, 2024 | www.navatelangana.com

గంగమ్మ బ్రిడ్జిలో పడ్డ వరికోత మిషన్



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో వరి కోతలు ప్రారంభం కావడంతో, మండలానికి వరి కోత మిషన్లు, కోత కోయడానికి వస్తున్నాయి. కాగా మండల కేంద్రంలోని గంగమ్మ బ్రిడ్జి పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో తాత్కాలిక రోడ్డు నిర్మించడంతో తాత్కాలిక రోడ్డుపై వస్తున్న వరి కోత మిషన్ ఆదివారం వేకువ జామున ప్రమాదవశాత్తు గంగమ్మ బ్రిడ్జ్‌లో పడిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. క్రేన్ సహాయంతో మిషన్ ను బయటకు తీశారు. ఇలాంటి ఘటనలు జరగడం వారం రోజుల్లో ఇది రెండవసారి. ధాన్యం తరలిస్తున్న లారీ గత సోమవారం ప్రమాదవశాత్తు బ్రిడ్జ్ లో పడింది. పంట కోతకు రావడం, రైతులు జిల్లా కేంద్రానికి, మండల కేంద్రానికి ఇదే రోడ్డు నుండి ధాన్యాన్ని తరలించనున్నందున మరో ఘటన జరగకముందే బ్రిడ్జి పనులను పూర్తి చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బాలుడి కిడ్నాప్ ఛేదన

తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు





నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కిడ్నాపైన బాలుడు కేసును పోలీసులు ఛేదించారు. బాలుడు మణికంఠను కిడ్నాప్ చేసి నాందేడ్ కు తరలించే ప్రయత్నం చేస్తుండగా.. పోలీసులు పట్టుకున్నారు. సీసీపుటేజీల ఆధారంగా కేసును ఛేదించారు. ముగ్గురు మహిళలు శుక్రవారం అర్ధరాత్రి బాలుడు మణికంఠను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం బాలుడి తండ్రి రాజు ఫిర్యాదుతో ఒకటో టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వివరాలు మెయిన్‌లో..

మొగులొస్తే ముయ్యాలి.. ఎండొస్తే తెరవాలి



మద్నూర్ మార్కెట్ యార్డులో సోయా పంటపై కవర్‌కప్పుతున్న రైతులు

- సోయా ఆరబెట్టేందుకు రైతులకు ఇక్కట్లు
- 12 శాతం మాయిచ్చర్ కోసం తిప్పలు

నవతెలంగాణ-మద్నూర్

సోయా పంటను ఆరబెట్టేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణం మార్పులతో ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుంటుండగా.. కొద్ది సేపటి తర్వాత ఎండ కాస్తుంది. మేఘాలు కమ్ముకున్న సమయంలో పంటపై టార్పలిన్ కవర్లు కప్పుతుండగా.. ఎండ కాసే సమయంలో తెరుస్తున్నారు. మాయిచ్చర్ 12 శాతం రావాలని కొనుగోలు కేంద్రంలో కొర్రీలు పెట్టడంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు.

మద్నూర్ మార్కెట్ యార్డులో సోయా పంట కొనుగోలు కేంద్రం కొనసాగుతున్న విషయం విధితమే. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.4892 ప్రకటించగా.. ప్రయివేటులో 4350 ధరతో కొనుగోలు చేస్తున్నారు. ప్రయివేటులో ధర రూ.542 వ్యత్యాసం ఉండటంతో కొనుగోలు కేంద్రంలోనే విక్రయించేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. కాగా తేమ శాతం 12 ఉండాలని నిబంధనలు పెట్టారు. దీంతో తేమ శాతం వచ్చేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. నిత్యం వాతావరణంలో మార్పులు వస్తూ ఉండటంతో మొగులు వస్తే ముయ్యాలి ఎండ వస్తే తెరుచుకుంటూ కష్టాలు పడుతున్నారు.

మద్నూర్ మార్కెట్ యార్డులో ఒక్కొక్క రైతు ఐదారు రోజులుగా తేమ శాతం కోసం పంటను ఆరబెడితున్నారు. ఈ క్రమంలో ఆకాశంలో మబ్బులు రావడం చిన్నటి చినుకులు వస్తుండటంతో ఇక్కట్లు పడుతున్నారు. దీంతో పంట కాపలా కోసం కుటుంబీకులు వంతుల వారీగా వస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఎస్సారెస్పీ గేట్లు మరోసారి ఎత్తివేత

- ప్రవాహం పెరగడంతో 12 గేట్లు ఎత్తి 37 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



దిగువ గోదావరికి విడుదలవుతున్న మిగులు జలాలు

నవతెలంగాణ-మెండోరా

ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయని శ్రీరాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుండి వరద ప్రవాహం పెరగడంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తం అవుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం ప్రాజెక్టు స్పిల్ వే 12 గేట్లు ఎత్తి గోదావరి నదిలోకి 37,488 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గోదావరి లోకి నీరు విడుదల చేయడంతో పరివాహక ప్రజలు ప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు చేశారు. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 46 వేల 942 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీరు నిలకడగా ఉన్నందున మిగులు జలాలు దిగువకు వదిలుతున్నారు. ప్రాజెక్టు 12 స్పిల్ వే గేట్ల ద్వారా 37 వేల 488 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తు కాకతీయ కాలువకు 5800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల నుంచి 2200 క్యూసెక్కులు , సరస్వతి కాలువకు 500 , లక్ష్మి కాలువకు 150 , వరద కాలువ కు 5000 వేల క్యూసెక్కులు వదులుతూ మిషన్ భగీరథ ద్వార 231 క్యూసెక్కుల తాగునీటి కోసం సరఫరా చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

పరివాహ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోదావరి నదిలోకి నీటివిడుదల చేస్తున్నందున మత్స్యకారులు నదిలో చేపలు పట్టేందుకు వెళ్ళరాదని, వలలు కొట్టుకుపోయే అవకాశం ఉన్నందువలన బయటకు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఉన్న చేపలు పట్టేవారు , పశువుల కాపరులు సామాన్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవరూ నదిలోకి దిగి ప్రమాదానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు.

వర్షంతో ఆగమాగం

తడిసిన ధాన్యం, సోయా పంటలు



ఫతేపూర్ శివారులో తడిసిన ధాన్యం చూపిస్తున్న రైతులు

నవతెలంగాణ-బోధన్

వర్షం పలువురి రైతులను ఆగమాగం చేసింది. శనివారం రాత్రి బోధన్ ఉమ్మడి మండలంలో కురిసిన అకాల వర్షానికి రైతులు ఆరబెట్టిన ధాన్యం, సోయా పంటలు తడిసిపోయాయి. దాంతో రైతులు ఇబ్బందులు పడుతూ ఆదివారం ధాన్యం, సోయా పంటలను ఆరబెట్టుకోడానికి ప్రయాసపడ్డారు. అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇప్పటికి ఏర్పాటు చేయకపోవడంతో పలుచోట్ల దళారులు లంగరువేసి చేసి ధాన్యం, సోయా కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలపై ఆశలు వదులుకొని దళారులను ఆశ్రయించి పంటలు విక్రయిస్తున్నారు. ఫతేపూర్ గ్రామ శివారులో రైతులు ఆరబెట్టిన పంటలు వర్షానికి పూర్తిగా నీటితో తడిసిపోయాయి. దాంతో రైతులు వర్షపు నీటిని తొలగించి మళ్లి పంటలను ఆరబెట్టుకున్నారు. అధికారులు ఇప్పటికైన స్పందించి తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని, సోయా కొనుగోళ్ల త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చినుకులతో తీరని నష్టం



తడిచిన ధాన్యం చూపుతున్న రైతు

నవతెలంగాణ-మోపాల్

ఆదివారం కురిసిన చినుకుల వర్షం తీరని నష్టం చేకూర్చిందని రైతులు వాపోయారు. ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లు ఆరబెడితేనే ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నందున, వాటిని ఆరబెట్టే సమయంలో వర్షం రావడంతో మోపాల్, తానాకుర్ధి శివారు ప్రాంతంలో వడ్లు మొత్తం తడిచి ముద్దయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభించాలని, తడిచిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అన్ని వర్గాలకూ ప్రాధాన్యం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి, సలహాదారు షబ్బీర్‌అలీ



బాధ్యతలు స్వీకరిస్తున్న మద్ది చంద్రకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

'ప్రజా పాలన కార్యక్రమం చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. ఎన్నికలలో ఇచ్చిన అన్ని గ్యారెంటీలను అమలు పరుస్తున్నాం. అదే విధంగా బడుగు బలహీన వర్గాలకు అన్ని రంగాలలో ప్రాధాన్యం కల్పిస్తున్నట్టు' జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ తెలిపారు. కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మద్ది చంద్రకాంత్‌రెడ్డి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమనికి ఇరువురూ హాజరై మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్ర మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేస్తున్నారని అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 10 లక్షల వరకు ఆరోగ్య బీమ అందిస్తున్నట్టు తెలిపారు. రాబోవు రోజులలో జిల్లాలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని, ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికే రైతన్నలకు రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నట్టుతెలిపారు. రెండు లక్షల పైన రుణమున్న వారికి కూడా రుణమాఫీ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాష్ శ్రీనివాస్,మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి,సుభాష్ రెడ్డి, ఎడ్ల రాజిరెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందు ప్రియా చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలీసు సంస్మరణ వారోత్సవాలు : ఎస్పీ

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా పోలీస్ కార్యాలయల ఆవరణలో పోలీస్ అమరవీరుల స్థూపాన్ని కొత్తగా నిర్మించడం జరిగిందనీ, సోమవారం జరగబోయే పోలీస్ అమరవీరుల దినోత్సవం అక్కడే నిర్వహించనున్నట్టు జిల్లా ఎస్పీ సింధు శర్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా సంస్మరణ కార్యక్రమాలను అక్టోబర్ 21వ తేది నుండి అక్టోబర్ 31వ తేది వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఔత్సాహిక విద్యార్థులు పాల్గొవాలని సూచించారు.

గ్రూప్-1 అభ్యర్థులను స్వార్థం కోసం వాడుకోవడం దుర్మార్గం

నాడు నిరుద్యోగుల గోడు పట్టని బీఆర్ఎస్

టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం ధ్వజం



కోదండరామ్‌తో కలిసి అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కేసీఆర్ ప్రభుత్వ జమానాలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించమన్నందుకే అరెస్ట్ లు చేసి, నిర్బంధాలు అమలు చేసిన నిరంకుశ ప్రభుత్వ నేతలు.. నేడు నిరుద్యోగ గ్రూప్ వన్ అభ్యర్థులను తమ స్వార్థం కోసం వాడుకోవడం దుర్మార్గమని టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్ ధ్వజమెత్తారు. కోదండరామ్‌కు నిజామాబాద్ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో టీఎన్జీవో భవనంలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు.

వివరాలు మెయిన్‌లో..

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, సీఎం దిష్టిబొమ్మ దహనం
- రైతు భరోసాకు రామ్‌రామ్ అంటూ నినాదాలు





నిజామాబాద్‌లోని ధర్నా చౌక్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం.. కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద..

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

రైతులను కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం నిరసనలు చేపట్టారు. నిజామాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ జడ్పీ చైర్మన్ దాదన్న విటల్ రావు, మాజీ నుడా చైర్మన్ చామకూర ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు, రైతు భరోసా మర్చిపోయిందని తెలిపారు. పంటలు కోతకు వచ్చినా గాని పంటకు రైతు భరోసా ఇవ్వక పోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 6 గ్యారంటీలను అట్టకెక్కించారని తెలిపారు. రైతుబంధును తుంగలో తొక్కి సగం మందికి మాత్రమే రైతు రుణమాఫీ చేసి మమ అనిపించారని అన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన 6 గ్యారంటీలతోపాటు, రైతు భరోసా , రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్యప్రకాశ్, సుదాం రవిచందర్, దండు శేఖర్, ఎనగందుల మురళి, పరమేష్, నీలగిరి రాజు,మల్కాయి మహేందర్, గాండ్ల లింగం, చింతకాయల రాజు, విట్టల్, మధుకర్ రెడ్డి, సనడిల్లా, గంగామని తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : రైతులను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, గట్టగోని గోపిగౌడ్, కుంబాల రవియావవ్, కౌన్సిలర్లు గెరిగంటి లక్ష్మినారాయణ, నజీరోద్దీన్, కృష్ణాజిరావు, కాసర్ల స్వామి, నాయకులు బల్వంత్‌రావు, భానుప్రసాద్, మల్లేష్ యాదవ్, సుమిత్రా ఆనంద్, రావుల గంగాధర్, దుబ్బాక ప్రసాద్, లద్దూరి కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనతోనే అరాచకాలు

- దాని మతతత్వ కుట్రలను తిప్పికొట్టేందుకే పోరాటాలకు సిద్ధం కావాలి
- ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- సీపీఐ(ఎం) నగర మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు



మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు





మాట్లాడుతున్న పెద్దివెంకటరాములు, నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీజేపీ పాలనతో అరాచకాలు పెరుగుతున్నాయని, బిజెపి కుట్రలను తిప్పికొట్టేందుకే పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపునిచ్చారు. పార్టీని బలోపేతం చేసుకుంటూ పోరాటాలను పెంచుకోవాలని సూచించారు. భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) నగర 7వ మహాసభ ఆదివారం నగరంలోని నాందేవాడలో గల పార్టీ కార్యాలయంలోని మునావర్ ప్రాంగణంలో నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నగర కమిటీ సభ్యురాలు బి. అనసూయ అధ్యక్షతన సభ నిర్వహించారు. నగర మహాసభ సందర్భంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సభలో గత మూడు సంవత్సరాల కాలంలో నగరంలో నిర్వహించిన ఉద్యమ కార్యాచరణను కార్యక్రమాలను నివేదికను నగర కమిటీ సభ్యులు సుజాత వివరించారు.

ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. ఇండియా కూటమి గెలవకూడదని దుష్ప్రచారం చేశారని, అలాగే అయోధ్యలో రామ మందిరం నిర్మాణం జరిగితే గెలుస్తామని అనుకున్న బిజెపికి అయోధ్యలో బిజెపికి తగిన గుణపాఠం ప్రజలు చెప్పారన్నారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణతో ఇతర పార్టీలతో కలిసి అధికారంలోకి బిజెపి ప్రభుత్వం వచ్చిందని ప్రజలే బుద్ధి చెప్పారని తెలిపారు. గ్రామపంచాయతీ నుండి మొదలుకొని ఎంపీ వరకు ఒకే దఫాలో జమిలీ ఎన్నికలు అనే నినాదంతో ముందుకు వెళ్లేందుకు ఎన్‌డీఏ సర్కార్ ఉవ్విళ్లురుతూందని, దీంతో రాష్ట్రాలకు ఉండే హక్కులు కోల్పోవడమే కాక.. అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా నుండి ఎంపీగా గెలిపించుకున్న ధర్మపురి అరవింద్ జిల్లా ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. నిజాంబాద్ ఎంపీ కేవలం సోషల్ మీడియాకు పరిమితమ య్యారని ప్రజలకు గల సమస్యలపై గొంతెత్తి ఎప్పుడూ కూడా మాట్లాడలేదని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యాడన్నారు. రైతుల సమస్యలు వారికి పట్టకనే వ్యవసాయ చట్టాలుగా తీసుకువచ్చారని అన్నారు. రైతుల ఉద్యమాలతో వాటిని వెనక్కు తీసుకున్నారని, ఉద్యోమాలతోనే డిమాండ్‌లు, హక్కులు సాధించుకోవచ్చని మరోసారి నిరూపితమైనట్టు తెలిపారు. ప్రస్తుతం బీజేపీని ఎదిరించాలంటే సీపీఐ(ఎం) మరింత క్యాడర్ పెంచుకోవాలని చెప్పారు.

అంతకుముందు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట రాములు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజకీయం సంక్షోభం నెలకొందన్నారు. మహానేత సీతారాం ఏచూరీని కోల్పోయామని, పూలు వేసి నివాళి అర్పిస్తే సరిపోదని, ఆయన ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే అసలైన నివాళి అందించిన వారమవుతామని తెలిపారు. దేశంలోనూ రాష్ట్రంలోనూ రోజురోజుకు శ్రమదోపిడి ఎక్కువ అవుతుందని కష్టపడి పని చేయించుకుంటున్నారే తప్ప సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ప్రశ్నించిన వారిని అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారని అన్నారు. వాటిని ఎదుర్కోవాలంటే ఉద్యమించక తప్పడం లేదన్నారు. బీజేపీ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ఆ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలే మహిళలను కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని అన్నారు.

అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నూర్జహాన్ మాట్లాడుతూ.. బిజెపి పార్టీ మూడోసారి అధికారంలోకి వచ్చాక విపరీతంగా ధరలు పెరిగిపోయాయని అదుపు చేయడంలో విఫలమయ్యారన్నారు. నోట్లను రద్దు చేయడమే కాకుండా మహిళలపై రోజురోజుకు హత్యలు, లైంగికదాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అన్నారు. ధరలు అదుపు చేయడంలో లైంగికదాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబ పాలన కొనసాగించిందని, ప్రస్తుతం వచ్చిన కాంగ్రెస్ పార్టీ 11 నెలలైనా ప్రజా సమస్యలపై మాత్రం పనిచేయడం లేదని అన్నారు. ఇవన్నీ మారాలంటే ఎర్రజెండా వస్తేనే సమాజం మారుతుందని పోరాటాలకు అడుగులు వేయాలన్నారు.

మహాసభలో సిపిఎం నగర కమిటీ సభ్యులు నరసయ్య, రాములు నరేష్, అనిత, దీపిక, రజియా, రేఖ,పద్మ, సునీత జ్యోతి, భూమన్న, ఉద్ధవ్,సురేష్ మధు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) జెండా ఆవిష్కరిస్తున్న సిర్పలింగం

ముగ్గురు ఉపాధ్యాయులకు ఘన సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు గ్రామస్తులు, తాజా మాజీ సర్పంచ్ వికార్ పాషా, మాజీ ఎంపీటీసీ ఎస్.కె అహ్మద్, హాజీ ఖాన్ తమ గ్రామంలో ఉపాధ్యాయులుగా ఎంపికైన కంతం బాలకృష్ణ, (ఎస్‌జీటి) అహ్మద్ భాషా(పిఈటి), ఉర్దూ మీడియం ఉపాధ్యాయురాలు ఉమేరా ఫాతిమా (ఎస్‌జీటి)లకు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హాజీ ఖాన్, పిట్ల భూమేష్, అంకం సంతోష్, రఫిక్ ఖాన్, నరేష్, గిరిప్రసాద్, చింటూ, జలిల్, గంగాధర్, రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం గ్రామానికి చెందిన ఈగ కౌటా నారాయణరెడ్డి (65)అనారోగ్యంతో మృతి చెందాడు. బోర్గం గ్రామం ఆర్యానగర్‌లోని మృతుని నివాసనికి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు మాజీ నూడా చైర్మన్, జిల్లా ఒలింపిక్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి, ఈగ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి నారాయణరెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని ఒక్క స్నేహితుడిని కోల్పోయానని ఆయన అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపన్ని వ్యక్తం చేశారు.

పట్టణంలో 'స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ'


కాలనీవాసుడికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే స్వచ్ఛకాలనీ సమైఖ్య కాలనీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ వారంతో 66వ వారానికి చేరింది. కాలనీలోని 8వ వీధి మెయిన్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించి మురుగు కాల్వలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నీరు నిలువ ఉండడం వలన పరిసరాలలో పిచ్చి మొక్కలు ఉండడం వలన దోమల బెడద ఎక్కువై డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా లాంటి వ్యాధులు సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాంటి సమస్యలు మా కాలనీలో ఉత్పన్నం కాకూడదని కాలనీ అభివృద్ధి కమిటీ నిర్ణయం మేరకు ప్రతీ ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైఖ్య కాలనీ కార్యక్రమం చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎల్‌టి కుమార్, సత్యనారయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

వైద్య పరీక్షలపై అవగాహన కల్పిస్తూ నిజామాబాద్ కంఠేశ్వర్ వద్ద గల పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో అక్షిత ఫౌండేషన్, అపోలో డయాగ్నోస్టిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలు రకాల పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్షిత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సన్నీ కుమార్ రాపాక, దండు థామస్, మహేష్, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా యువజన విభాగం అధ్యక్షునిగా మందుల బాలు


బాలును సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

భారతీయ జనతా యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల బాలును తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా నియామకం చేయడాన్ని హర్షిస్తూ బీజెపి నాయకులు ఆదివారం ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బీజెపి జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్ మాట్లాడుతూ మందుల బాలును జిల్లా యువజన విభాగం తెలంగాణ ముదిరాజ్ మహాసభకు అధ్యక్షులుగా నియమించినందుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారికి ఇలాంటి పదవులు మునుముందు ఎన్నో రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి పులి యుగంధర్, పట్టణ ఉపాధ్యక్షులు దోండి ప్రకాష్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ్ గౌడ్, పట్టణ కార్యదర్శి రెడ్డబోయిన దక్షిణమూర్తి, శ్రీకాంత్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్ చెక్‌పోస్టు తనిఖీ చేసిన సబ్ కలెక్టర్


తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

నవతెలంగాణ-పొతంగల్

మండలంలో గల చెక్‌పోస్టును సబ్ కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు జారీ చేశారు. వచ్చి పోయే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, వాహనాలలో అక్రమంగా ఇసుక, ధాన్యం, నగదు, మద్యం రవాణా జరిగితే వాహనాలను ఆపి, సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలని ఆదేశించారు.

కాంగ్రెస్‌లో చేరిన మత్స్య పారిశ్రామిక సంఘ అధ్యక్షుడు



నవతెలంగాణ-మెండోరా

బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోన్‌పేట్ నారాయణ గంగాపుత్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సోన్‌పేట్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు భూమన్న, కార్యకర్తలు బాబు, సుభాష్, మాజీ సర్పంచ్ ప్రకాష్, సలీం, సాహేందర్, తోట మహేష్, బండారి సాయన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు భరోసా అమలు చేయాలి

- సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు



మాట్లాడుతున్న సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైతాంగానికి ఇచ్చిన హామీని ప్రభుత్వం మాట మార్చడం సరైనది కాదని, రైతు భరోసా వెంటనే అమలు చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని నాందేవ్‌వాడలో గల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రమేష్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కన్నా ముందు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ డిసెంబర్ నెల నుంచి రైతులకు రైతు భరోసా రూ.15000 అందజేస్తామని చెప్పి.. ఇప్పుడు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వచ్చే వానాకాలం పంట నుండి రైతు భరోసాను అమలు జరపటానికి ఆలోచిస్తామని ప్రకటించటం అంటే రైతులను మోసం చేయటమే అవుతుందని అన్నారు. కావున ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసాను వెంటనే ప్రకటించాలని అదేవిధంగా రైతులు పండించిన అన్ని రకాల పంటలకు బోనస్ ధరను ఇవ్వాలని, రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12,000 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా తీర్పు నిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్‌రాములు, జిల్లా కమిటీ సభ్యులు సుజాత తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్


పలువురిని సన్మానిస్తున్న సిఐటియు నాయకులు

నవతెలంగాణ-బోధన్

గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బోధన్ ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధ్యక్షులు సాగర్ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు కుప్రియాల్ బాలయ్య, శంకర్ మాట్లాడుతూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని సంఘాన్ని స్థాపించామని, సంఘం పోరాటాల ఫలితంగా కొన్ని సమస్యలు పరిష్కారం అయినప్పటికీ, అనేక వేధింపులు పెరిగాయన్నారు. కార్మికులు ఐక్యత్యంగా ఉండి పోరాటాల ద్వారా మాత్రమే హక్కులు సాధించగలమని వారు పేర్కొన్నారు. జిల్లా నాయకులు జంగం గంగాధర్ మాట్లాడుతూ.. తెలంగాణలో గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల కేసీఆర్ అవలంబించిన విధానాలనే రేవంత్ రెడ్డి సర్కార్ కొనసాగిస్తుందని, సమస్యలు పరిష్కారం చేయకపోతే కాంగ్రెస్‌కు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందన్నారు. గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, ఆరోగ్య భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక అధికారులు వేధింపులు సరైనవి కాదని, వేధింపులు ఆపకపోతే తగిన పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్మికులు హక్కులు సాధించటానికై భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రేఖ, శరత్ రెడ్డి, శ్రీనివాస్, వినోద్ కుమార్, గంగాధర్, వజీర్ పాషా, శంకర్, గంగామణి తదితరుల పాల్గొన్నారు.

నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు సన్మానం


నూతనంగా ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-బోధన్

సుదర్శన్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బోధన్ పట్టణంలో నూతనంగా ఉద్యోగాలు సాధించిన నార్ల గంగా కిషోర్, నార్ల గంగా ప్రసాద్, స్వరూప, పాషా ఉపాధ్యాయులకు ఫౌండేషన్ ప్రతినిధి అశోక్ కుమార్ రోడే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 వేల మంది జీవితాల్లో వెలుగు నింపిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమైందని అన్నారు. దీనికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలి


మాట్లాడుతున్న దుడ్డు గంగాధర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని, కబ్జాలకు పాల్పడుతున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం నిజామాబాద్ నగరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములు, ఫారెస్ట్ భూములు, రోడ్లు, పార్క్ స్థలాలు ఆక్రమణకు, కబ్జాకు గురవుతున్నాయని వాటి రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలువైన భూములు అన్యాక్రాంతానికి గురవుతుంటే అధికారులు చోద్యం చూడటం సిగ్గుచేటని అన్నారు. 12వ డివిజన్‌లో ప్రభుత్వ భూములు, ఫారెస్ట్ భూములు కబ్జాకు గురవడం అక్రమార్కులు పేదలకు ఆ భూములు అమ్మడం లాంటి ఘటనలు చూస్తుంటే కబ్జా దారులు ఏవిధంగా రెచ్చిపోతున్నారో అర్థమవుతుందన్నారు. కబ్జా దారుల పట్ల అలసత్వం వహించకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో భూముల రక్షణకు ప్రజలతో కలిసి ఉద్యమం చేస్తామని దుడ్డు గంగాధర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు శివ రాజు, మోజీరాంలు ఉన్నారు.

పలు గ్రామాలలో బోనాల పండగ


ఎడపల్లి: బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-ఎడపల్లి/మాక్లూర్

మండలంలోని జానకంపేట, జంలం, ఎడపల్లి మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలను ఎత్తుకుని గ్రామ దేవతల ఆలయాల వరకు ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామాల్లో మహాలక్ష్మి పండుగ..


మాక్లూర్‌లో..

మాక్లూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో మహాలక్ష్మి పండుగను బోనాలతో ఘనంగా గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన మారంపల్లి అశోక్ కుమారుడు విగ్నేష్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. ఈ విషయమై వైద్య ఖర్చుల నిమిత్తం తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి వారికి రూ.5000 ఆర్థికసాయం చేశారు. ఈ ఆర్థిక సాయాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ మండలాధ్యక్షుడు జావీద్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, ప్రవీణ్ గౌడ్, విద్యాసాగర్, తౌటు గంగాధర్, సంతోష్‌గౌడ్, బండి మల్లేష్, హరికృష్ణ, నవీన్ కుమార్, తేజ, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

విలీన సభకు తరలిన కార్మిక సంఘాల నాయకులు

నవతెలంగాణ-బోధన్

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న టియుసిఐలో ఐఎఫ్టియు విలీన సభకు బోధన్ ఏరియా నుండి బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, మున్సిపల్ కార్మికులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ రాష్ట్ర కమిటీ నాయకులు బి.మల్లేష్ మాట్లాడుతూ దేశంలో కార్మికవర్గంపై ప్రభుత్వాల, యజమానుల అణిచివేత, దోపిడీ పెరుగుతుందని, కార్మిక వ్యతిరేక విధానాలు తీవ్రంగా ముందుకు వస్తున్నాయని ఆర్థిక దోపిడీయే కాకుండా, మత ఉన్మాద దృక్పథంతో ఫాసిస్టు విధానాలతో మోడీ ప్రభుత్వం ముందుకు వస్తుందని అన్నారు. కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నదని అన్నారు. కార్మికవర్గ ఐక్యతకు, సమిష్టి ఉద్యమానికి దేశ వ్యాప్తంగా కృషి చేస్తున్న టియుసిఐలో ఐఎఫ్టీయూను విలీనం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక ప్రతినిధులు బి.నాగమణి, ఆర్.లక్ష్మి, కళావతి, బీపాషా బేగం, మధ్యాహ్న భోజన పథకం ప్రతినిధులుగా రెహానా బేగం, భవన నిర్మాణ కార్మికుల ప్రతినిధులుగా కే.రవి, మధు, జర్రు, ఎ.గంగారాం, కిషన్, ఆంజనేయులు, కె.సురేష్, ఎస్.సురేష్, మున్సిపల్ కార్మికుల ప్రతినిధులుగా సాదుల మరియమ్మ, సి.హెచ్.ప్రభాస్, సి.హెచ్ చిన్న ప్రభాస్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎఫ్ కార్మికులను ఆదుకోవాలి

- కోదండరామ్‌కు కార్మిక సంఘం నాయకుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీ కార్మికులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరుతూ ఎమ్మెల్సీ కోదండరాంకు కార్మిక సంఘ నాయకులు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ గత 2015 సంవత్సరంలో ఫ్యాక్టరీ లే ఆఫ్ అయినప్పటి నుండి ఇప్పటివరకు కార్మికులకు ఎలాంటి వేతనాలు చెల్లించలేదని అన్నారు. దాంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యం పాలై మరణిస్తున్నారని, వారి కుటుంబాలు దీనస్థితిలో ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ వేసిందని, పునరుద్ధరణ కమిటీ ప్రతినిధులు కూడా ఫ్యాక్టరీని సందర్శించి ఫ్యాక్టరీని తెరిపించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారని, కానీ ఇంతవరకు ఎలాంటి ప్రయత్నాలు జరగలేదని, కావున ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఫ్యాక్టరీని పున్నప్రారంభించి కార్మికులకు విధులు తీసుకోవాలని, పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన వారిలో కార్మిక సంఘం నాయకులు రవిశంకర్ గౌడ్, శ్రీధర్, స్వామి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ హోంగార్డు మృతి



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో హెూంగార్డుగా పని చేస్తున్న చిన్నయ్య (39) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ నెల 16న తన ఇంటి వద్ద యాసిడ్ తాగిన చిన్నయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మరణించాడు. చిన్నయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడా.. లేక మద్యం మత్తులో నీళ్ల అనుకుని యాసిడ్ తాగాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు ఆరవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

నాట్య గురువు డాక్టర్ మృణాళినికి సన్మానం


మృణాళిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో నటరాజ నృత్యానికేతన్ ద్వారా ఎందరో విద్యార్థులకు శాస్త్రీయ నృత్య శిక్షణనిస్తూ తీర్చిదిద్దుతున్న నాట్య గురువు మృణాళినికి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా ఆదివారం ఘన సన్మానం జరిగింది. పట్టణంలోని రామ్‌నగర్‌లో గల రామాలయంలో నాట్య విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఘన సన్మానించారు. శాస్త్రీయ నృత్యం ద్వారా పేరిణి, ఆంధ్రనాట్యం శిక్షణనిస్తూ వేలమంది పిల్లలను తీర్చిదిద్దిన మృణాళిని, భారతీయ సాంప్రదాయాలను, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా చేస్తున్న సేవలకు గానూ వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ వారు న్యూఢిల్లీలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మృణాళిక సేవలను ప్రముఖ కళాకారుడు కోకిల నాగరాజు, శాస్త్రీయ నృత్యం నేర్చుకుంటున్న పిల్లల తల్లిదండ్రులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నటరాజ నృత్యనికేతన్ వ్యవస్థాపకులు మాడవేడి నారాయణకు మృణాళిని సత్కారం అందించారు. ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తగా కోకిల నాగరాజు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఇందూరు యువత వ్యవస్థాపకులు సాయిబాబు, గుమ్మడి చంద్రయ్య, మధు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల 2001-2002 సంవత్సర పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం వి కన్వెన్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు దాదాపు 23 వసంతాల తర్వాత అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు తమ మనోగతం, ఉపన్యాసాలు ఇచ్చారు. విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
సోమవారం | అక్టోబర్ 21, 2024 | www.navatelangana.com

ఆలయ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని మేడిపల్లి గ్రామంలో శ్రీ కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆలయ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు స్థానిక నాయకులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో సిసి రోడ్ నిర్మాణం పనులు ప్రారంభించినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారగోడు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమీపంలో లింగంపేట్లోకి వెళ్లే ప్రధాన రహదారి పై గతంలో మురికి కాలువపై మురికినీరును మళ్ళించడానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. గతంలో బ్రిడ్జి నిర్మాణం ఎత్తుగా చేపట్టడంతో ఇరువైపులా రహదారికి మట్టిని వేయగా వర్షాకాలం వస్తే బురదతో వాహనదారులు రాకపోకలు వెళ్లేవారు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారని తెలిపారు.ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు.


ప్రారంభమైన రోడ్డు పనులు

రైతులను వంచించిన కాంగ్రెస్


బిచ్కుంద : ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు


లింగంపేట్‌లో..


రామారెడ్డిలో..

- రైతుభరోసా నిధులు వేయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తాం
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలు చోట్ల ఆందోళనలు..
- సీఎం, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-విలేకరులబృందం

రైతులకు రైతుబంధు ఇస్తామని ఇప్పటి వరకు ఊరించి రైతు భరోసా లేదని వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించి రైతులను మోసం చేశారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. రైతులను నమ్మించి వంచించారని దుయ్యబట్టారు. వెంటనే రైతుభరోసా నిధులు విడుదల చేయాలని, లేకుంటే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను ఆ పార్టీ శ్రేణులు దహనం చేశారు. రోడ్లపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు.

బిచ్కుంద : రైతులతో కలిసి బిచ్కుంద మండల కేంద్రంలోని బస్టాండ్ ముందు బయటాయించి ధర్నా నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్రావు దేశాయ్ మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రెండు దఫాలుగా ఎకరానికి ఐదువేల చొప్పున రైతుల ఖాతాలో వేసి ఆదుకుందని పది వేలు ఏమి సరిపోతాయని తమ ప్రభుత్వం వస్తే ఎకరానికి 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె ఎక్కిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీ మరచి నిండా ముంచిందని ఆరోపించారు. వ్యవసాయ శాఖ మంత్రి రైతు భరోసా ఇచ్చుడు కాదని రైతులకు చావుకోబురు చల్లగా చెప్పారని అన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం ఎప్పటికి బాగుపడదని పెద్దలు అన్న మాట ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతు భరోసా రెండు లక్షల రుణమాఫీ ప్రతి ఒక్క రైతుకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే రైతుల ఉద్యమం తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు శ్రీహరి రాజు, జిలకర బాబురావు, బసవరాజ్ పటేల్, రామ్ చందర్, హాజీ లక్ష్మణ్, డాక్టర్ రాజు, రాజుపటేల్, సంజుపటేల్, గంగారెడ్డి, మల్లికార్జున్ పటేల్, రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేష్ మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఆరోపించారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బేశరతుగా రైతులకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం రహదారిపై సిఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. రాస్తారోకో సందర్భంగా ప్రధాన రహదారిపై ఇరుపక్కల భారీగా వాహనాలు నిలిచిపోయాయి స్థానిక పోలీసులు ఆందోళన కారులను శాంటిపజేయడంతో నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నర్సింలు ముదాం సాయిలు శ్రీకాంత్ రాజశేఖర్ రెడ్డి మనోహర్ సురేందర్ లక్ష్మణ్ రవీందర్ నాయక్ వివేకానంద భారాసా కార్యకర్తలు నాయకులు పాల్గన్నారు.

రామారెడ్డి: మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు ఆదివారం ధర్నా చేసి, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా, రైతుబంధు ఇవ్వకుండా, తెలంగాణ ప్రభుత్వం రైతులను విస్మరిస్తోందని ఆరోపించారు. గంగమ్మ వాగు బ్రిడ్జి పనులు నత్తనడకన నడుస్తున్నాయని, వెంటనే బ్రిడ్జి పనులను పూర్తి చేసి మండల ప్రజలకు పూర్తి స్థాయిలో రవాణా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ అధ్యక్షుడు రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, నాయకులు నారాయణ రెడ్డి,గడం రవిందర్ రెడ్డి ,పడిగెల శ్రీనివాస్, జంగం లింగం, తుపాకుల రాజేందర్ గౌడ్, రామదుగు హనుమాన్లు, కడెం శ్రీకాంత్, బా నూరి నర్సారెడ్డి,మొగ్గం లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: దోమకొండ మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ శారదా నాగరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచాల శేఖర్, విండో చైర్మన్ తిరుపతి గౌడ్, నాయకులు గజవాడ శ్రీకాంత్, బొమ్మరా శ్రీనివాస్, రమేష్, సాయి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


దోమకొండలో..

నాగిరెడ్డిపేట్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరుతూ ఆదివారం రోజు మండల కేంద్రంలో మెదక్ ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య, మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి , ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు కృష్ణ , రాజిరెడ్డి , హనుమంత్ రెడ్డి మంగలి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఎం దిష్టిబొమ్మను తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ గ్రామ మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాసరెడ్డి, స్థానిక సొసైటీ చైర్మన్ కమలాకర్ రావు, నాయకులు మర్కంటి బుచ్చయ్య, గడీల భాస్కర్, మాజీ సింగల్ విండో చైర్మన్ మంగ్యా నాయక్, మాజీ ఎంపీటీసీ మంగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని స్థానిక ధర్నా చౌక్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా భారాసా పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు రైతు భరోసా కింద ప్రతి రైతుకు ఎకరాకు 15000 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఏ రైతుకు కూడా ఎకరాకు 15000 వేలు ఇవ్వలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బే శారతుగా రైతులకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం రహదారిపై సిఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల భారస అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు ఎగుల నర్సింలు,మునిసిపల్ కౌన్సిలర్ ఎరుకల సాయిలు, బీఆర్ఎస్ నాయకులు సురేందర్, రాజయ్య,మల్లారెడ్డి, రాములు,బర్కత్,.బబ్లూ, కార్యకర్తలు నాయకులు పాల్గన్నారు.


నాగిరెడ్డిపేట్‌లో..


సదాశివనగర్‌లో..


ఎల్లారెడ్డిలో..

డబుల్ రోడ్డు పనులు ప్రారంభించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశినగర్ మండల కేంద్రంలోని డబల్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య, మాజీ వైస్ ఎంపీపీ గాదరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కవిన్ ఎస్సీ విభాగం మండల జనరల్ సెక్రెటరీ జగ్గ బాలరాజ్ తదితరులు ఎమ్మెల్యేను ఆదివారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఇందిరమ్మ కమిటీలు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామాల్లో ఇల్లు లేకుండా నిరుపేదలుగా ఉన్న గుడిసెల్లో ఉంటున్న ఇల్లు కూలిపోయి కూలిన ఇళ్లల్లో ఉంటున్న నిరుపేద దళిత కుటుంబాలకు ముందుగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరినట్టు తెలిపారు.

టీఎస్పీటీఏ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రైమరి టీచర్స్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సాందీపని జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా దుబాసి నరేందర్, ప్రధాన కార్యదర్శిగా లింబాద్రి, గౌరవ అధ్యక్షులు గా అనిల్, ఉపాధ్యక్షులుగా విజయ్, గంగయ్య కార్యదర్శిగా శ్రీను, కార్యవర్గ సభ్యులుగా సతీష్, యేసు రత్నం, మోహన్, సుధారాణి, తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎన్నికైన దుబాసి నరేంద్ర మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే జీవో నెంబర్ 25ని సవరించి ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల పరిరక్షణ కోసం పాటుపడాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కోరారు.


ఎన్నికైన టీఎస్పీటీఏ కార్యవర్గం

నీటిసౌకర్యానికి బోరు


నూతన బోర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని 38,వ వార్డులోని నూతన బోర్‌ను మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కామారెడ్డి పట్టణంలోని 38వ వార్డులో నీటి సమస్య ఉందని చైర్ పర్సన్ దృష్టికి తీసుకురావడం వల్ల వెంటనే స్పందించి బోర్ వేయించినట్టు వార్డు కౌన్సిలర్ చాట్ల రాజేశ్వర్ తెలిపారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుందున ప్రతి ఒక్కరు ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతను పాటించాలని పరిసరాలు నీటిగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోని, పంపరి లతా శ్రీనివాస్, గడ్డమీది రాని మహేష్, గోనె శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని నాగ్లూర్ గ్రామానికి చెందిన యువకుడు ఆదివారం గాంధారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గాంధారి గ్రామ శివారులో సాయంత్రం 04.00 గంటలకి ఎస్ ఆర్ దాబా సమీపంలో పద్మాజివాడి ఎక్స్ రోడ్ నుంచి వస్తున్న లారీ దాని ముందు వెళుతున్న బైకును ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న నాగ్లూర్ గ్రామానికి చెందిన భాస్కర్(42)కు తలకు గాయం కావడంతో మృతి చెందాడు. ఆయన భార్య లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మృతునికి ఓ కుమార్తె ఓ కుమారుడు ఉన్నారు.

భూమి పూజకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన టీఎన్జీవోస్ బృందం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

టీఎన్జీవోస్ ఎల్లారెడ్డి యూనిట్ అధ్యక్షులు మహిపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మదన్మోహన్ రావును కామారెడ్డిలోని తన నివాసంలో ఆదివారం నాడు మర్యాదపూర్వకంగా కలిసి టీఎన్జీవోస్ నూతన భవన నిర్మాణ భూమి పూజకు ఆహ్వానించారు. అలాగే భవన నిర్మాణానికి నిధులు అందించి సహకరించాలని కోరామని టీఎన్జీవోస్ అధ్యక్షుడు మహిపాల్ తెలిపారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల టీఎన్జీవో ఉద్యోగులు కార్యదర్శి శరన్ కుమార్, కోశాధికారి రవీందర్, జాయింట్ సెక్రెటరీ రాజా గౌడ్, శ్రీకాంత్, అరుణ్,ముఖిద్, పృధ్విరాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న టీఎన్జీవోస్ బృందం

సీఐటీయూ స్టిక్కర్ల ఆవిష్కరణ


సీఐటీయూ స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, డ్రైవర్లు



నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

బాన్సువాడ పట్టణం లో ఆటో యూనియన్ లోకల్ సీటీయూ యూనియన్ ఆధ్వర్యంలో స్టిక్కర్లను సీఐటీయూ నేత ఖలీల్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆదివారం బాన్సువాడ పట్టణంలో ఆటో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఎండి ఖలీల్ మాట్లాడుతూ లోకల్ యూనియన్ ఏర్పాటైన తర్వాత క్రమశిక్షణతో ఆటోలు నడుపుతున్నారని, చాలా మంచిది అదేవిధంగా యూనియన్ ని రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్న ఇప్పటివరకు కార్మికుల కు ఇచ్చిన హామీ అమలు చేయడం లేదని, ఆటో కార్మికులకు వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వ నెలకు 15 వేలు రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బాన్సువాడ పట్టణంలో ఆటో డ్రైవర్ లందరికీ డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు చాంద్ యూనియన్ ఆసిఫ్ ఖాన్, లక్ష్మణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

నవతెలంగాణ-పెద్దకొడప్గల్

మండల కేంద్రంతో పాటు విఠల్‌వాడి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న పక్కాసమాచారం మేరకు శనివారం రాత్రి పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి 15 మందిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. వారి వద్ద నుండి 30 వేల రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడుతే వారిపైన, పేకాట స్థావరాలపై కఠిన చర్యలు తీసుకొని వారిపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ మహేందర్ తెలిపారు.

78 యూనిట్ల రక్త సేకరణ

నవతెలంగాణ-కామారెడ్డి

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్),ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో కర్షక్ బిఎడ్ కళాశాలలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం అయ్యిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు. ఆదివారం చేపట్టిన క్యాంప్‌లో 78 యూనిట్లు సేకరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు పదివేలకు పైగా ఉన్నారని అలాంటి చిన్నారులకు 20 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరం ఉందని ఇటీవల కాలంలో రక్తనిధి కేంద్రాలలో రక్తనిల్వలు లేకపోవడంతో చిన్నారులకు కావలసిన రక్తం దొరకకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తలసేమియా సికిల్ సెల్ సొసైటీ సూచనల మేరకు ఈ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని,ఈ శిబిరంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న రక్తదాతలు మానవతా దృక్పథంతో స్పందించి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు డాక్టర్ వేదప్రకాష్, ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్, ఉపాధ్యక్షులు జమీల్ హైమద్ డాక్టర్ పుట్ల అనిల్ కుమార్, కిరణ్ సలహాదారులు ఎర్రం చంద్రశేఖర్, ఆర్కే విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జైపాల్ రెడ్డి, శ్రీ ఆర్యభట్ట విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గురువేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ దత్తాద్రి తెలిపారు.



నాయకా.. న్యాయం చేయు

- ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన వర్శిటీ లెక్చరర్లు
- కాంట్రాక్టు ప్రొఫెసర్లుగా గుర్తించాలని వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అరకొర వేతనాలతో కొన్నేళ్లుగా యూనివర్సిటీల్లో పని చేస్తున్న తమను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ యూనివర్సిటీ పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ ఎమ్మెల్సీ కోదండరామ్‌కు విన్నవించుకుంది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ప్రసన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కోదండరామ్‌ను ఆదివారం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మినిమం టైం స్కేల్ కల్పిస్తూ, వెంటనే అమలు చేయాలని కోరారు. విద్యార్హతలు ఉన్నప్పటికీని, సమాన పనికి సమాన వేతనం అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు నింగినంటిన ప్రస్తుత సమయంలో, ఓ పిరియడ్‌కు కేవలం రూ.700 మాత్రమే చెల్లిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్సిటీల్లో పార్ట్ టైం లెక్చరర్లను చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన చెందారు. తమను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా గుర్తించినప్పుడే, ఈ అసమానతలు తొలగుతాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి, తొందరలోనే న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్టుతెలిపారు. కార్యక్రమంలో పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు అరిగెల హరిత, కోశాధికారి కొట్టూరి గంగాధర్, నాయకులు, లెక్చరర్లు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న లెక్చరర్లు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఏఆర్పి క్యాంప్ గ్రామానికి చెందిన పాప గోని వినోద్‌గౌడ్ కుమార్తె అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా స్థానిక గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న బిజెపి సీనియర్ నాయకులు కందగట్ల రామచందర్ వైద్య ఖర్చుల నిమిత్తం బాలిక కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి బాలిక ఆరోగ్య విషయాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేవైఎం ఎడపల్లి మండల అధ్యక్షులు వెంకటేష్, ఏఆర్‌పి క్యాంప్ రేషన్ డీలర్ మహబూబ్ తదితరులున్నారు. దీంతో రాంచందర్‌ను పలువురు అభినందించారు

ఆపరేషన్ కోసం ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని ముచ్కూర్ గ్రామానికి చెందిన ములుగు నాగరాజు తండ్రి రాజేశ్వర్ తీవ్రమైన నరాల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కొరకు హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చేరాడు. వైద్య సహాయం కోసం ఈ విషయాన్ని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌కు తెలియజేయగానే ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2,50,000 ఎల్‌ఓసిని అందజేశారు. కష్టకాలంలో ఆదుకున్న ముత్యాల సునీల్ కుమార్‌కు వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



ఎల్‌ఓసి అందజేత

ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని జాగిర్యాల గ్రామంలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘం అధ్యక్షుడు శివసారి నర్సయ్య, సీఈఓ రవీందర్, డైరెక్టర్ నూకల లింబాద్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని భీంగల్, గోన్ గోపుల గ్రామాల్లో రెండు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏ-గ్రేడ్ ధాన్యం ధర రూ.2320, బి-గ్రేడ్ రూ.2300 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అంతేకాకుండా సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు వివరించారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధికారులు, రైతులు, మాజీ ఎంపీటీసీలు, ఉప సర్పంచ్, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే



మహాలక్ష్మి బోనాలలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వినాయక్‌నగర్, కంఠేశ్వర్‌లో నిర్వహించిన మహాలక్ష్మి బోనాల పండుగ ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ పండుగలలో ఒకటి బోనాల పండుగని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ల లక్ష్మి నారాయణ, మహాలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, 19వ డివిజన్ నాయకులు, మున్నూరు కాపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నుడా చైర్మన్‌గా కేశవేణు బాధ్యతలు స్వీకరణ

- హాజరుకానున్న పీసీసీ అధ్యక్షులు, జిల్లా ఇంఛార్జి మినిస్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పాత మున్సిపల్ కార్యాలయంలో (నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) నుడా చైర్మన్‌గా నిజామాబాద్ కాంగ్రెస్ నగర అధ్యక్షులు కేశ వేణు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమానికి పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరు కానున్నారు. అనంతరం సాయంత్రం 4గంటలకు బస్వా గార్డెన్‌లో యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ ఎన్రోల్మెంట్ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి, ఎక్సైజ్ పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీమంత్రి, బోధన్ నియోజకవర్గం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, బాల్కొండ కోఆర్డినేటర్ సునీల్‌రెడ్డి, ఆర్మూర్ కో ఆర్డినేటర్ వినయ్ రెడ్డి, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొననున్నట్టు పేర్కొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి అభినందన సభ



మాట్లాడుతున్న పుల్గం దామోదర్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జిల్లా వాసి పుల్గం దామోదర్‌రెడ్డికి జిల్లా శాఖ తరఫున కామారెడ్డిలో ఆదివారం అభినందన సభ నిర్వహించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనలో ముందు ఉంటానని తెలిపారు. కాగా రాబోయే టీచర్ ఎమ్మెల్సీ కరీంనగర్ నియోజకవర్గం అభ్యర్థిగా వంగ మహేందర్‌రెడ్డి పిఆర్‌టీయు అభ్యర్థిగా పోటీ చేయనుండగా.. పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుషాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్ రెడ్డి, చెన్న కేశవరెడ్డి, శ్వకట్ రెడ్డి గారు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా మండల, మహిళా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు కార్యవర్గ సభ్యులు ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు

అన్ని హంగులతో అందుబాటులోకి ఏటీసీ కేంద్రాలు



ఏటీసీ కేంద్రం ఊహాచిత్రం

- సత్వర ఉద్యోగ, ఉపాధిని అందించేలా అడ్వాన్స్డ్ కోర్సులలో శిక్షణ
- ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని కలెక్టర్ వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు అధునాతన హంగులతో అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం తెలిపారు. ఈ కేంద్రాల శాశ్వత భవన నిర్మాణాలు, శిక్షణా తరగతుల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని అన్నారు. ఏటీసీలలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సత్వరమే ఉద్యోగ, ఉపాధి లభించేందుకు విరివిగా అవకాశాలు ఉన్నందున ప్రత్యేక ప్రాధాన్యత కనబరుస్తున్నామని తెలిపారు. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) కంపెనీ సహకారం, సమన్వయంతో యువతలో నైపుణ్యం పెంపొందించడం కోసం ఎన్‌సివిటి ఆమోదించిన పరిశ్రమ 4.0 ట్రేడ్‌లలో నైపుణ్య కోర్సులను ప్రవేశపెట్టడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలలో (ఐటీఐ) అధునాతన సాంకేతిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు.

ఏటీసీలలో అధునాతన కోర్సులను పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్ (క్యాంపస్ ప్లేస్‌మెంట్స్) నిర్వహించబడుతుందని, డొమెస్టిక్, మల్టీ-నేషనల్ కంపెనీల (ఎంఎన్‌సి) ద్వారా రిక్రూట్ చేయబడతారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో అప్రెంటిస్‌షిప్, ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని, టాటా మోటార్స్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, కిర్లోస్కర్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌ఏఎల్, లాక్‌హీడ్ మార్టిన్ యుఎస్ ఆధారిత కంపెనీ మొదలైన 100 కంటే ఎక్కువ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించవచ్చని తెలిపారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో నూతనంగా ప్రవేశపెట్టిన కొత్త కోర్సులను, వాటిని నేర్చుకుంటే కలిగే ఉపయోగాలను ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు.

మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్..

ఈ కోర్సు కాల వ్యవధి 1 సంవత్సరం వుంటుంది. ప్రతి ఏటీసీ సెంటర్‌లో సీట్ల సంఖ్య 40 వరకు ఉన్నాయి. ఈ కోర్సులో స్వయంచాలక తయారీ ప్రక్రియలు, నియంత్రణ వ్యవస్థలు, నాణ్యత నిర్వహణలో విద్యార్థులను నైపుణ్యంతో సన్నద్ధం చేయడం వంటివి ఉంటాయి. ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ (పిఎల్‌సిసిఎన్‌సి), పారిశ్రామిక ఆటోమేషన్ (సెన్సార్లు, యాక్యుయేటర్లు, నియంత్రణ వ్యవస్థలు), రోబోటిక్స్, మెకాట్రానిక్స్, ప్రోసెస్ కంట్రోల్ అండ్ మేనేజ్మెంట్, నాణ్యత నియంత్రణ, నిర్వహణ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, న్యూమాటిక్స్, హైడ్రాలిక్స్‌లో తర్ఫీదు ఇస్తారు.

ఈ కోర్సు నేరుచుకున్న వారు ఆటోమేషన్ టెక్నీషియన్, ప్రాసెస్ కంట్రోల్ ఇంజనీర్, తయారీ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ ఇన్స్పెక్టర్, రోబోటిక్స్ మెయింటెనెన్స్ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, కంట్రోల్ సిస్టమ్ టెక్నీషియన్‌గా స్థిరపడవచ్చు. ఆటోమోటివ్, ఏరోస్పేస్, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, రసాయనాలు, టెక్స్ టైల్స్, చమురు, వాయువు పరిశ్రమలలో ఉద్యోగాలకు అవకాశం లభిస్తుంది.

మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సు..

దీని కాల వ్యవధి 2 సంవత్సరాలు. సీట్ల సంఖ్య 24 చొప్పున ఉన్నాయి. ఈ కోర్సులో ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ, మరమ్మతు ట్రబుల్ షూటింగ్లో విద్యార్థులను నైపుణ్యంతో సన్నద్ధం చేయడం వంటివి వుంటాయి. ఎలక్ట్రిక్ వెహికల్ ఆర్కిటెక్చర్, బ్యాటరీ నిర్వహణ వ్యవస్థలు, ఎలక్ట్రిక్ మోటార్ నియంత్రణ, పవర్ ఎలక్ట్రానిక్స్, ఛార్జింగ్ సిస్టమ్స్, భద్రతా ప్రోటోకాల్స్, ట్రబుల్ షూటింగ్ నిర్వహణ వుంటాయి. ఈ కోర్సు నేర్చుకున్న వారు ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నీషియన్ ఇవి మెయింటెనెన్స్ ఇంజనీర్, బ్యాటరీ టెక్నీషియన్, ఛార్జింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ స్పెషలిస్ట్, ఇవి సర్వీస్ సెంటర్ మేనేజర్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. ఎలక్ట్రిక్ వెహికల్ తయారీ, ఇవి సర్వీస్ సెంటర్లు, ఛార్జింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్, ఆటోమోటివ్ పరిశోధన - అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమలలో అవకాశాలను కల్పిస్తుంది.

బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్)..

ఈ కోర్సు కాల వ్యవధి 2 సంవత్సరాలు, సీట్ల సంఖ్య 24 చొప్పున ఉన్నాయి. కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి మెకానికల్ డిజైన్, సిమ్యులేషన్, వెరిఫికేషన్లో విద్యార్థులను నైపుణ్యంతో సన్నద్ధం చేయడం జరుగుతుంది. మెకానికల్ డిజైన్ ఫండమెంటల్స్, సిఎడి సాఫ్ట్వేర్ (సాలిడ్వర్క్స్ ఆటోడెస్క్ ఇన్వెంటర్), సిఎఇ సాఫ్ట్వేర్ మోడలింగ్-అనుకరణ, వర్చువల్ ధృవీకరణ, డిజైన్ ఫర్ మ్యానుఫ్యాక్చురబిలిటీ, రేఖాగణిత డైమెన్షనింగ్, టాలరెన్సింగ్ వంటివి వుంటాయి. ఈ కోర్సు నేర్చుకున్న వారు మెకానికల్ డిజైన్ ఇంజనీర్, డిజైన్ వెరిఫికేషన్ ఇంజనీర్, వర్చువల్ టెస్టింగ్ ఇంజనీర్, ఉత్పత్తి అభివృద్ధి ఇంజనీర్, తయారీ ఇంజనీర్ వంటి వాటికి అర్హులు. ఆటోమోటివ్, ఏరోస్పేస్, పారిశ్రామిక సామగ్రి, వినియోగ వస్తువులు, వైద్య పరికరాలు, శక్తి యుటిలిటీస్, నిర్మాణం వంటి పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది.

ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్డ్ టూల్..

కాలవ్యవధి 1 సంవత్సరం. సీట్ల సంఖ్య 20 చొప్పున ఉన్నాయి. ఈ కోర్సులో వివిధ హస్తకళలు, ట్రేడ్లలో క్లిష్టమైన డిజైన్లు, నమూనాలు ఉత్పత్తులను రూపొందించడానికి అధునాతన సాధనాలు, సాంకేతికతలను ఉపయోగించడంలో విద్యార్థులను నైపుణ్యంతో సన్నద్ధం చేయడం వంటివి ఉంటాయి. అధునాతన సాధనం నిర్వహణ, ప్రెసిషన్ క్రాఫ్టింగ్, ఫినిషింగ్ టెక్నిక్స్, డిజైన్ వివరణ, విజువలైజేషన్, మెటీరియల్ ఎంపిక, ప్రాసెసింగ్, భద్రతా ప్రోటోకాల్, వర్క్‌షాప్ నిర్వహణ, కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ సాఫ్ట్వేర్, 3డీ ప్రింటింగ్, మోడలింగ్, మాస్టర్ క్రాఫ్ట్ మాన్, టూల్ అండ్ డై మేకర్, ప్రెసిషన్ ఇన్స్ట్రుమెంట్ మేకర్, జ్యువెలరీ డిజైనర్ అండ్ మేకర్, ఫర్నిచర్ మేకర్ అండ్ రిస్టోరర్, శిల్పి - మోడల్ మేకర్, ఉత్పత్తి డిజైనర్ వంటి ఉద్యోగాలకు అర్హులు. క్రాఫ్ట్, హస్తకళలు, ఆభరణాలు, వాచ్ మేకింగ్, ఫర్నిచర్, చెక్క పని, శిల్పం తయారీ, ప్రెసిషన్ ఇన్స్ట్రుమెంటేషన్, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, ఆటోమోటివ్ ఇండస్ట్రియల్ వంటి వాటిలో ఉద్యోగాలకు అవకాశాలను కల్పిస్తుంది.

అడ్వాన్స్డ్ సిఎన్‌సి మిషినింగ్ టెక్నీషియన్..

ఈ కోర్సు కాల వ్యవధి 2 సంవత్సరాలు. సీట్ల సంఖ్య 24 చొప్పున ఉన్నాయి. ఈ కోర్సులో వివిధ హస్తకళలు, ట్రేడ్లలో క్లిష్టమైన డిజైన్లు, నమూనాలు, ఉత్పత్తులను రూపొందించడానికి అధునాతన సాధనాలు, సాంకేతికతలను ఉపయోగించడంలో విద్యార్థులను నైపుణ్యంతో సన్నద్ధం చేయడం వంటివి ఉంటాయి. ఈ కోర్సు నేర్చుకున్న వారు మాస్టర్ క్రాఫ్ట్‌మాన్, టూల్ అండ్ డై మేకర్, ప్రెసిషన్ ఇన్స్ట్రుమెంట్ మేకర్, జ్యువెలరీ డిజైనర్ అండ్ మేకర్, ఫర్నిచర్ మేకర్ అండ్ రిస్టోరర్ వంటి ఉద్యోగాలకు అర్హులు.

పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు పై కోర్సులలో నేరుగా చేరవచ్చని కలెక్టర్ సూచించారు. తొలి విడతగా జిల్లాలోని నిజామాబాద్ ప్రభుత్వ బాలుర ఐటీఐ, బోధన్, కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఐ.టీ.ఐలలో ఈ నెలాఖరులోపు ఇంటర్వ్యూకు హాజరై ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు.

ప్రజల మధ్య వైరుధ్యాలను సృష్టిస్తున్న బీజేపీ

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పల్లపు వెంకటేష్

నవతెలంగాణ-నవీపేట్

దేశంలో ప్రజల మధ్య వైరుధ్యాలను సృష్టిస్తూ రాజకీయ లబ్ధిని బిజెపి పొందేందుకు ప్రయత్నిస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సార్ గార్డెన్‌లో దేవేందర్‌సింగ్ అధ్యక్షతన ఆదివారం 5వ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం ఎన్నికల హామీలను మార్చి ప్రజల మధ్య వైరుధ్యాలను సృష్టిస్తూ రాజకీయ లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తుందని అన్నారు. కొత్త చట్టాల పేరుతో



మాట్లాడుతున్న పల్లపు వెంకటేష్

కార్మికుల హక్కులను కాలరాస్తుందని, రైతులకు నల్ల చట్టాలు తెచ్చి చివరకు ప్రధానమంత్రి క్షమాపణలు చెప్పాల్సిన దుర్గతి పట్టిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాల కల్పన, ఉపాధి హామీ నిధులను తగ్గించడంతో పాటు రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ వేధింపులకు గురిచేస్తుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలైన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని అర్హత కలిగిన వారికి ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్ అమలు చేయాలని అన్నారు. గత మూడు సంవత్సరాల పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శంకర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాయక్‌వాడి శ్రీనివాస్, దేవేందర్‌సింగ్, ఆంజనేయులు, రాజశేఖర్, రమాదేవి, షేక్ మహబూబ్, పార్టీ సభ్యులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-1988 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం రోజు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 36 సంవత్సరాల తర్వాత కలిసి చదివిన స్నేహితులందరూ ఒక్క చోటికి చేరి తమ బాల్యంలో చేసిన పనులన్నీ గుర్తు చేసుకుంటూ అదేవిధంగా తమకు బోధించిన గురువులను గుర్తు చేసుకొని తమ సంతోషాలను ఒకరినొకరు పంచుకున్నారు. 36 సంవత్సరాల తర్వాత బాల్య మిత్రులందరికీ ఒకే చోటుకి చేరడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. కార్యక్రమాన్ని మనోహర్‌రెడ్డి, భీమిరెడ్డి, రమా గౌడ్, ఎల్లయ్య ప్రభాకర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, నరసింహులు అందరూ బాల్యమిత్రులందరికీ ఒక చోటికి చేర్చి తమ ఆనందాలను పంచుకున్నారు.

ప్రగతీశీల ఆలోచనలు సజీవంగా ఉండాలి

- పీడీఎస్‌యూ మొదటి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రగతిశీల విద్యార్థుల ఆలోచనలు సజీవంగా ఉండాలని పి.డి.ఎస్.యూ మొదటి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో న్యూ అంబేద్కర్ భవన్‌లో పి.డి.ఎస్.యూ 50వ అర్ధ శతాబ్ది ఉత్సవ సభను పి.డి.ఎస్.యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ శ్రీకాకుళ, నక్సల్ బరి పోరాటాలు వెల్లువెత్తుతున్న కాలంలో ప్రగతీశీల ఆలోచన విధానంతో పి.డి.ఎస్.యూ విద్యార్థి సంఘం ఏర్పడిందని అన్నారు. సమాజం పట్ల బాధ్యతగా ఎలా ఉండాలో పి.డి.ఎస్.యూ నేర్పుతుందని, మంచి ఆలోచన విధానాన్ని పెంచుతుందని గుర్తుచేశారు. విశ్వవిద్యాలయాల ముందు ఎగిరే పి.డి.ఎస్.యూ జెండా ఏ విద్యార్థి ఎటు వైపు దారి ఎంచుకోవాలో నేర్పుతుందని అన్నారు. ప్రభుత్వ హాస్టల్స్ లలో పురుగుల అన్నం, నీళ్లచారు నుండి ఏ రోజు కొంత మెరుగైన భోజనం అందుతుంది అంటే అది పి.డి.ఎస్.యూ. పోరాటాల వల్లనే అని అన్నారు. బడిలో చెప్పని చదువులు బ్రతుకులో తరిచి చూసి భవితవ్యపు జీవితానికి దారులు వేసేలా చేసేదే పి.డి.ఎస్.యూ అని ఉద్ఘాటించారు. అసమానతలు లేని సమాజ ఏర్పాటు ప్రస్తుత విద్యార్థుల మీద ఉందని అన్నారు. ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ఆర్.లింబాద్రి మాట్లాడుతూ.. మన లక్ష్యం గొప్పదైనప్పుడు ఎన్ని సమస్యలైనా ఎదుర్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ పి.డి.ఎస్.యూ నాయకులు పద్మారావు, మాధవరావు, శ్రీదేవి, శ్రీహరి, సాయి కుమార్, ఆకుల పాపయ్య, భాస్కర్, సంఘం, బి.ఎస్.బి, భూమన్న, విజయ రేఖ, అరుణ రేఖ, దాసు, గౌతమ్ ప్రసాద్, పరుచూరి శ్రీధర్, సల్ల సత్య నారాయణ, శ్యామ్, రమేష్, పస్క నర్సయ్య సరిత, ఎల్ బి రవి, ప్రస్తుత అధ్యక్ష కార్యదర్శులు ఆర్ గౌతంకుమార్, జన్నారపు రాజేశ్వర్, కార్తీక్, ప్రిన్స్, తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజును చేయాలి

- రైతులను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/ధర్పల్లి

రైతులను రాజులు చేయాలని, అందుకు రైతులను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అర్గుల్ సింగిల్ విండో పరిధిలోని సికింద్రాపూర్‌లో, బ్రాహ్మణపల్లి సింగిల్ విండోలో, అదేవిధంగా కొలిప్యాక్ సింగిల్ విండోలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో భూపతి రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పండించిన పంటను రైతులు తక్కువ ధరకు అమ్ముకోవద్దని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కాలంలో నుంచి గత 20 సంవత్సరాల క్రితం నుంచి రైతుల కల్లాల వద్ద నుంచి వరి ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించిందన్నారు. అదేవిధంగా ఐ.కె.పి సెంటర్ల ద్వారా ఐసిడిసి ఎమ్మెస్ ద్వారా సింగిల్ విండోల ద్వారా రైతుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో వర్షాలు మంచిగా కురిసి రైతులకు అనుగుణంగా ప్రభుత్వం కరెంటు అందించిందని దీని ద్వారా ఒక లక్ష 25 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని, ఇంత పెద్ద ఎత్తున వరి ధాన్యం రావడం ఇది ఒక చరిత్ర అన్నారు. గత ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ అంతట చీకటిమయమవుతుందని, ఉచిత కరెంటు ఇవ్వరని గత ప్రభుత్వం ఆరోపించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వర్షాలు పడవని ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేశారని ఆయన అన్నారు. 2004 సంవత్సరం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఉచిత కరెంటు ఇస్తూ రైతుల పక్షాన నిలబడిందన్నారు. ఈ కార్యక్రమలో మార్కెట్ కమిటీ చైర్మెన్ ముప్పా గంగారెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మెన్ మునిపల్లి సాయరెడ్డి, నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మాజీ నరేష్, గాడ్కోల్ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు అనంతరెడ్డి, అప్పల రాజన్న, మైదాం రాజన్న, తహసిల్దార్ కిరణ్మయి, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్, సర్పంచుల సంఘం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు రాజేందర్, సొసైటీ చైర్మెన్లు గంగారెడ్డి, నర్సారెడ్డి, శ్రీనివాస్, జక్రాన్‌పల్లి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ కాటిపల్లి నర్సారెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సోప్పరి వినోద్, వినోద్, శ్రీనివాస్‌గౌడ్, కొలిప్యాక్ మాజీ ఎంపీటీసీ మద్దుల రమేష్, మాజీ సర్పంచ్‌లు చిన్న సాయరెడ్డి, బాలకిషన్, శేఖర్, కొలిప్యాక్ మాజీ సొసైటీ చైర్మెన్ భాస్కర్, బ్రాహ్మణపల్లి మాజీ సొసైటీ చైర్మెన్ గంగారెడ్డి తెల్లన్న, వినోద్, అక్బర్, సంతోషనాయక్ తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి : కొనుగోలు కేంద్రం ప్రారంభించిన్న ఎమ్మెల్యే

ఫామ్‌హౌస్ పాలన తప్ప ప్రజలకు బీఆర్ఎస్ చేసిందేముంది

ధర్పల్లి : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఫామ్‌హౌస్ పాలన తప్ప, రాష్ట్ర ప్రజలకు చేసిందేముందని ఎమ్మెల్యే డా భూపతి రెడ్డి అన్నారు. ఇక బీజేపీ పార్టీ అంటే బడా జూటా పార్టీ అని విమర్శించారు. మండల కేంద్రంలోని ఐసీడీఎంఎస్ సొసైటీలోని వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా, ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నేడు యువకులకు ఉద్యోగాలు ఇస్తుంటే, పరీక్షలు పెడుతుంటే జీర్ణించుకోలేక ప్రజలకు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెఇపారు. బిళ్ళ రంగల్లగా కేటీఆర్, హరీష్‌రావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ప్రజలు వారి మాటలు నమ్మవద్దని హితవు పలికారు. బీజేపీ ఓ పక్క జూట మాటలు పలుకుతుందని.. ప్రధానమంత్రి స్థాయి వ్యక్తి కూడా అబద్దాలు మాట్లాడటం అంటే ఆపార్టీ ఎంతటి జూట పార్టీయో ప్రజలు గ్రహించాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారచంద్ నాయక్, నాయకులు శేఖర్ గౌడ్, మండల అధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాలరాజ్, సొసైటీ చైర్మెన్ చెలిమేల మల్లికార్జున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగీత్య నాయక్, మిట్టపల్లి గంగారెడ్డి, జేసీబీ శ్రీనివాస్, చెలిమేల నర్సయ్య, సుభాష్, లోక్కిడి రాములు, బొక్కల బాలయ్య, అర్గుల రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలికుంట నివారణా టీకాల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో ఆదివారం ఆవులకు, ఎడ్లకు, బర్రెలకు గాలి కుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాధి నివారణ టీకాలు అందజేసినట్టు మండల పశు వైద్య అధికారి లక్కం ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, పశువైద్య సిబ్బంది రాజేశ్వర్, నాగార్జున, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.


గేదెలకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

కువైట్‌లో కోనాసముందర్ వాసి మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ గ్రామానికి చెందిన గుండ్ల ఇబ్రహీంపట్నం భూమేశ్వర్ (29) గత పదిహేను రోజుల క్రితం ఫిట్స్ రావడంతో కువైట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఇటీవల చనిపోయినట్టు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఎన్ఆర్ఐ అధ్యక్షులు బట్టు స్వామి ఆదివారం తెలిపారు. వెంటనే స్పందించి హాస్పిటల్ వెళ్లి బాడీని పంపంచేందుకు కావాల్సిన డాక్యుమెంట్స్‌ను సిద్ధం చేసినట్టు, ప్రవాస భారతీయుల హక్కుల వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహానాయుడు ఇండియన్ ఎంబసీతో మాట్లాడినట్టు త్వరలోనే శవాన్ని స్వదేశానికి రప్పించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు.



శాంతి భద్రతల పరిరక్షణకు
కదంతొక్కే కార్యదక్షులు..

నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

శాంతి భద్రతల పరిరక్షణకు కదం తొక్కే కార్యదక్షులు. ప్రజలను నిత్యం కంటికి రెప్పలా కాపాడుతూ సమాజ అభివృద్ధికి పాటుపడే సేవకులు. ఎన్ని కష్టాలు ఉన్నా.. దిగమింగుకొని ప్రజల రక్షణకు నిరంతరం పాటుపడేది పోలీసులు. ఈ పోరాటంలో సంఘ విద్రోహ శక్తుల దాడులకు కొంతమంది ప్రాణాలు కోల్పోయారు. ఆ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ.. నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ ప్రత్యేక కథనం.



నవతెలంగాణ-ఆర్మూర్

1959 అక్టోబర్ 21.. భారతదేశ సరిహద్దులో చైనా దురాక్రమణను తిప్పికొట్టేందుకు సిఆర్పిఎఫ్ జవాన్లు 14 గంటల పాటు విరోచితంగా పోరాడారు. పోరులో 12 మంది భారత జవాన్లు వీర మరణం పొందారు. అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే నాటి నుంచి దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల స్మారకార్థం ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలలో 39 మందికిపైగా పోలీసుల ప్రాణ త్యాగం..

నక్సలైట్ల ఉద్యమం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాల్లో పోలీసులు, సిఆర్పిఎఫ్, బిఎస్ఎఫ్ జవాన్లు మొత్తం 39 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇందులో కొందరు నక్సలైట్ల తూటాలకు బలి కాగా మరికొందరు బాంబు పేలుళ్లకు ప్రాణాలు విడిచారు. కాగా నక్సలైట్ల ఘాతకాలకు బలైపోయిన వారిలో జిల్లాకు చెందిన పోలీస్ అధికారులు సిబ్బంది 24 మంది ఉండగా, వివిధ పోలీసులు 15 మంది జవాన్లు జిల్లాకు బందోబస్తు కోసం వచ్చి దాడుల వల్ల ప్రాణాలు కోల్పోయారు. 1986 జనవరి రెండవ తేదీన కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్ మండలం పోసానిపేట పరిధిలోని గోకుల తండా అటవీ ప్రాంతంలో కుంభింగ్ నిర్వహిస్తున్న పోలీసులపై నక్సలైట్లు ఆకస్మికంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఏడవ బెటాలియన్‌కు చెందిన బీన్నీ శ్వరరావు ప్రాణాలు కోల్పోయారు. 1991 సంవత్సరం నందిపేట్ మండలంలోని యానం శివారులో నక్సలైట్లు మందు పాతరతో పోలీస్ జీపును పేల్చేశారు. దీంతో ఎస్సై సత్తయ్య మృతి చెందాడు. 1996 మార్చిలో పదవ తరగతి పరీక్షల బందోబస్తుకు వెళ్లిన ఏఎస్ఐ రామచంద్రారావును నక్సలైట్లు కాల్చి చంపారు. ఇదే సంవత్సరం ఎన్నికల బందోబస్తులో ఉన్న ఎస్సై విక్టర్ బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన సిరికొండ మండలంలోని రావుట్ల, న్యావనంది గ్రామాల మధ్య చోటుచేసుకుంది. కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన గంగాధర్ ఎమ్మెల్సీగా పనిచేసిన వి.గంగాధర్‌గౌడ్ గన్‌మెన్‌గా పనిచేశారు. 1996 జూన్ 6న జిల్లా సహకార బ్యాంకు వద్దకు కొందరు నక్సలైట్లు వచ్చి తుపాకి ఇవ్వాలని గంగాధర్‌ను డిమాండ్ చేయగా ఆయన నిరాకరించారు. దీంతో నక్సలైట్లు ఆయనన కాల్చి చంపారు. జిల్లా కేంద్రంలో పట్టపగలే ఈ ఘటన జరగడం అప్పట్లో తీవ్ర సంచలనం రేకెత్తించింది. 1996 ఆగస్టు 15న ఆయుధాల కోసం ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ పోలీస్‌స్టేషన్ నక్సలైట్లు మెరుపుదాడి చేయగా.. ఈ ఘటనలో బెటాలియన్‌కు చెందిన గులాం రసూల్ సుభాష్ చంద్రబోస్, జబ్బర్లాల్, వేణు మారుతి రావు, వాసు, అంజయ్య ప్రాణాలు కోల్పోయారు. 1998 ఫిబ్రవరిలో ఎన్నికల విధులు ముగించుకొని సిఆర్పిఎఫ్ జవాన్ బస్సులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారి చంద్రయాన్‌పల్లి వద్ద నక్సలైట్లు మందుపాతార పెట్టి బస్సును పేల్చివేశారు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు మరణించారు. గాంధారికి చెందిన కానిస్టేబుల్ కుతుబుద్దిన్ పల్లికొండలోని బంధువుల ఇంటికి వెళుతుండగా నక్సలైట్ల తూటాలకు బలయ్యారు.

ఆర్మూర్‌కు చెందిన తండ్రీ కొడుకులు..

పట్టణానికి చెందిన సోమరాజు, వెంకటేశ్వరరావు తండ్రీ కొడుకులు. వీరిద్దరూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఒకరు నక్సలైట్ల చేతిలో ప్రాణాలు కోల్పోయారు. మరొకరు అగ్ని ప్రమాద బాధితులను కాపాడే ప్రయత్నంలో చనిపోయారు. 1988 ఫిబ్రవరిలో జిల్లా కేంద్రంలోని వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో కానిస్టేబుల్ సోమరాజుపై నక్సలైట్లు ఆకస్మికంగా కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతిచెందారు. 2008 ఏప్రిల్ నెలలో డిచ్‌పల్లి శివారులోని జాతీయ రహదారిపై ఆగి ఉన్న బిస్కెట్స్ కంటైనర్‌లో మంటలు చెలరేగాయి. ఈ సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అక్కడికి చేరుకొని మంటల్లో చిక్కుకున్న కంటెయినర్ సిబ్బందిని కాపాడేందుకు ప్రయత్నించారు. కాగా బాధితులను రక్షించే క్రమంలో వెంకటేశ్వరరావు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రమాదంలో హోంగార్డ్ రవీందర్, ఏఆర్ కానిస్టేబుల్ అయూబ్ ఖాన్‌లు సైతం మరణించారు.

పోలీస్‌శాఖ ఏర్పాట్లు..

నేటి నుంచి ఈనెల 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమరులైన వారికి నివాళులు అర్పించడంతో పాటు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీలు, ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలిం పోటీలు, ఉచిత రక్తదాన శిబిరం, పోలీస్ కళ బృందంతో పలు కార్యక్రమాలు తెలంగాణలో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో పాత్ర, విచక్షణ రహితంగా మొబైల్ వాడకంపై విద్యార్థులకు ఆన్లైన్లో వ్యాసరచన పోటీలు సైతం నిర్వహిస్తారు.

వారి త్యాగాలు మాకు ఆదర్శం



సమాజంలో శాంతిభద్రతలు కాపాడే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరులే మాకు ఆదర్శం. వారిని స్ఫూర్తిగా తీసుకొని పనిచేస్తాం. ప్రాణాలు పణంగా పెట్టి కుటుంబాలకు దూరమైన పోలీసులు ఎప్పుడు చిరస్మరణీయులే. శాంతి భద్రతలను కాపాడేందుకు నిర్విరామంగా పనిచేస్తాం.

- వెంకటేశ్వరరెడ్డి, ఏసీపీ, ఆర్మూర్.

ప్రజల సమస్యలు తీరుస్తున్నాం



ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నాం. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ద్వారా ప్రజల సమస్యలు తీరుస్తున్నాం. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన గురుతరమైన బాధ్యత మాపై ఉంది. శాంతిభద్రతల కోసం 24 గంటలు సైతం పనిచేస్తున్నాం.

- రవికుమార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఆర్మూర్.

మూఢత్వాన్ని ఖండిస్తున్నాం

- జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు కోయేడి నర్సింలు

నవతెలంగాణ-మాక్లూర్

మాక్లూర్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థుల పట్ల మూఢత్వాన్ని ఖండిస్తున్నామని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు కోయేడి నర్సింలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. శాస్త్రీయ దృకృథాన్ని పెంపొందించవలసిన పాఠశాలలో మంత్రాలు, చేతబడుల నెపంతో జరిగిన ఉదాంతంపై తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సిఆర్టియుగా పనిచేస్తున్న సిబ్బంది బంగారు గొలుసు పోయిందని ఆ గొలుసును విద్యార్థి తీసిందనే అనుమానంతో చేతబడులు చేసే మంత్రగాడి దగ్గరికి తీసుకెళ్లి.. అంజనం పేరుతో, నిమ్మకాయలతో విద్యార్థి చేతికి పసరు పూసి విద్యార్థుల్లో మూఢత్వాన్ని భయాందోళనకు గురిచేయడం పట్ల జన విజ్ఞాన వేదిక తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి, శాస్త్రీయతకు విరుద్ధంగా మూఢనమ్మకాలను ప్రోత్సహించే విధంగా జరిగిన ఈ ఘటనకు బాధ్యులైన వారిపై జిల్లా ఉన్నతాధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో భయాందోళనలు పారదోలి, మంచి వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాక్లూర్ మండల కన్వీనర్ బోడ ప్రమోద్, కట్ట నరేష్ కుమార్ నాయక్, వెంకట మల్లయ్య, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో 1999-2000 పదవ తరగతి విద్యార్థులు 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి అధ్యాపకులకు ఆహ్వానించారు. బాల్యపు చిలిపిచేష్టలు, మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కుటుంబ సభ్యులను ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. ఇలాంటి స్నేహ బంధం కలకాలం కొనసాగాలని కోరుకున్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం విద్యావ్యవస్థలో ఉన్న పరిస్థితులు నేటి పరిస్థితులు పోల్చుతూ ఉపాధ్యాయులు సందేశం అందించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఏళ్ల క్రితం చదివిన వారంతా ఇప్పుడు సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న వి.కోటేశ్వరరావు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు రైతులకు ఇచ్చిన హామీలకు కట్టుబడి వాటిని వెంటనే అమలుపరచాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వి కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలు చేపడుతున్నాయని ఆయన అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం చారిత్రాత్మక రైతు ఉద్యమానికి ఇచ్చిన లిఖితపూర్వక హామీ, వ్యవసాయ రంగంలో తెచ్చిన మూడు నల్ల చట్టాలను ఉపసంహరించుకొని ఎంఎస్పి మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని తీసుకువస్తానని, రైతు అప్పులను మాఫీ చేస్తానని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకొని రైతులపై మోపబడిన కేసులు అన్నింటిని ఎత్తివేస్తానని, ఉద్యమ సమయంలో మరణించిన కుటుంబాలను ఆదుకుంటానని, రైతులందరికీ పరిహారం చెల్లించి వారిని ఆదుకుంటానని ఇచ్చిన హామీలు అమలు చేయలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాల్లో కార్పొరేట్ కంపెనీలకు పెద్దపీట వేస్తున్నారని పంట భూములను పారిశ్రామికవేత్తలకు బడా కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే విధానాలను అవలంబిస్తున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం అవుతుందని, ఈ జిల్లాలో మూతపడిన రెండు చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని అందుకుగాను మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో సబ్ కమిటీని వేశారని ఇలా కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించి నడిపించాలని డిమాండ్ చేశారు. ఎన్‌సిఎస్ఎఫ్ సారంగాపూర్ చక్కర ఫ్యాక్టరీని బెల్లం కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నడిపించాలని అన్నారు. బెల్లంకు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని పైగా దీనికి జిఎస్టి ఉండదని ఈ ప్రాంత రైతులు ఫ్యాక్టరీ తెరిస్తే చెరుకు పండించేందుకు సిద్ధంగా ఉన్నారని వారన్నారు. వరి పంట కోతకొచ్చినందున కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం లేదని కోతలు ప్రారంభమై రైతులుపంట ఆరబోసుకుంటున్నందున వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ఈ ఖరీఫ్ పంట నుంచి చెల్లించాలని ఇది అన్ని రకాల పంటలకు అమలు పరచాలని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రెండు లక్షల రుణమాఫీ అమలుపరచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సాయి రెడ్డి, ఉపాధ్యక్షులు ఎర్రయ్య, టి కృష్ణగౌడ్, సహాయ కార్యదర్శి ఏ చిన్నయ్య, శ్రీనివాస్ రెడ్డి, బాబురావు, మార్క్స్, గోపాల్, విటల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన పలువురు

- సమస్యలపై విన్నపం

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌రూరల్


కంఠేశ్వర్ : కోదండరాంను సన్మానిస్తున్న ఆదె ప్రవీణ్

ఎమ్మెల్సీ, తెలంగాణ జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ కోదండరాంను తెలంగాణ బీసీ మహాసభ నిజామాబాద్ జిల్లా కన్వీనర్, సర్వసమాజ్ కమిటీ నిజామాబాద్ కోకన్వీనర్, కాంగ్రెస్ పార్టీ, నిజామాబాద్ జిల్లా సీనియర్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులు ఆదే ప్రవీణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్సీని కలిసిన పాత పెన్షన్ పోరాట సమితి..

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఎంఎల్‌సి కోదండరాంను 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం కలిశారు. 2003 ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆలస్యంగా పోస్టింగ్‌లు ఇవ్వడం వలన దాదాపు 9000ల మంది ఉద్యోగ ఉపాధ్యాయులు సిపిఎస్ విధానంలోకి వచ్చారని ఇలాంటి వారందరికీ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికి మెమో 57 ఆధారంగా పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు అమలు చేయాలని సూచించింది. దేశంలోని అనేక రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా 2003 ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేశాయని మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 2003 ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు రవిందర్, విజయ్ కుమార్, గుత్ప ప్రసాద్, సురేందర్, శ్రీహరి, రామకృష్ణ, ప్రవీణ్ రెడ్డి, గంగాధర్, శ్రీధర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు..

విద్యాశాఖలో ప్రస్తుతం ఎదుర్కుంటున్న సమస్యలను స్టేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంఎల్సీ కోదండరాం దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏఎస్ ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్, మహేశ్వర్, గంగాకిషన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంను సన్మానించిన నుడా చైర్మెన్..

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రొఫెసర్ కోదండరాంను నుడా చైర్మన్ కేశ వేణు సన్మానించారు. నగరంలోని కాంగ్రెస్ నేత కొండపాక రాజేశ్ ఇంట్లో ప్రొఫెసర్‌ను కలిశారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్‌గా ఎన్నికైన కేశ వేణును ప్రొఫెసర్ కోదండరాం అభినందించారు.

నిజామాబాద్ రూరల్ : ఎమ్మెల్సీ కోదండరామ్‌ను తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) నిజామాబాద్ జిల్లా పక్షాన ఆత్మీయ సన్మానం చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై, ముఖ్యంగా 317 జీ.ఓ. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను, 5 డిఎలు, పిఆర్‌సిలు తక్షణమే చెల్లించాలని, సిపిఎస్ రద్దు, కేజీబీవీ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు వంటివి తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌టిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బట్టు కృష్ణారెడ్డిరెడ్డి, రుద్రంగి ప్రవీణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వర్ణ సమత, జిల్లా ఉపాధ్యక్షులు టేకుర్ల సాయిలు, కార్యవర్గసభ్యులు రవీందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలుచోట్ల ఆందోళన
- కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కంఠేశ్వర్


డిచ్‌పల్లి : మంత్రి తుమ్మల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు విమర్శించారు. ఆదివారం నిజామాబాద్ మాజీ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బీగాల ఆదేశాల మేరకు ధర్నాచౌక్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విటల్‌రావు, మాజీ నుడా చైర్మన్ చామకూర ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. అన్నదాతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై కన్నెర్ర చేశారని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందని తెలిపారు. పంటలు కోతకు వచ్చినా పంటకు రైతుభరోసా ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 6 గ్యారంటీలను అటకెక్కించారని తెలిపారు. రైతుబంధును తుంగలో తొక్కి సగం మందికి మాత్రమే రైతు రుణమాఫీ చేశారని విమర్శించారు. రైతు భరోసా ఊసే లేదన్నారు. వెంటనే ఎన్నికల ముందు హామీఇచ్చిన 6 గ్యారంటీలతోపాటు, రైతు బంధు, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బీఆర్ఎస్ నాయకులు సత్యప్ర కాశ్, సుదాం రవిచందర్, దండు శేఖర్, ఎనగందుల మురళి, పరమేష్, నీలగిరి రాజు, మల్కాయి మహే ందర్, గాండ్ల లింగం, చింతకాయల రాజు, విట్టల్, మధుకర్‌రెడ్డి, సన ఉల్లా, గంగామని తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ : మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మోచ్చ శ్రీనివాస్, న్యాల్కల్ శ్రీనివాసరావు, ఉమాపతి రావు, సంగ్య నాయక్, తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల దిష్టిబొమ్మ దహనం..

డిచ్‌పల్లి : బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే మాజీ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశాల మేరకు డిచ్‌పల్లి మండల కేంద్రంలో నిజామాబాద్ హైదరాబాద్ రహదారిపై బైటాయించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షులు శక్కరి కొండ కృష్ణ మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదని, రైతుకు అన్ని విధాలా అండగా ఉండాలంటూ, రైతులకు సమయానుకూలంగా రైతు భరోసా ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఎగవేత చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు కర్రకాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు. అధికారంలోకి రాకముందు ప్రజలకు, రైతులకు, ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా చులకనగా చేస్తు మాట్లాడుతున్నారని అయిన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నల్లవెల్లి సాయిలు, నీరడి పద్మారావు, ఒడ్డం నర్సయ్య, సుధాం రాథోడ్, గోపు నడిపి చిన్నన్న, హన్మంత్‌రెడ్డి, దికొండ సీను, నట్ట భోజన్న, మొచ్చ సీను, మధుకర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు బుల్లెట్ అక్బర్ ఖాన్, కిరణ్, గంగి సాయిలు, సంజయ్, పడకల్ శ్రీనివాస్, సరిత రూరల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిష్టిబొమ్మను బీఆర్ఎస్ మండల నాయకులు డిచ్‌పల్లి మండల కేంద్రంలో దహనం చేశారు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖరీఫ్ కాలానికి సంబంధించిన రైతుబంధు కాకుండా రబీ కాలానికి రైతుబంధు ఇస్తామని అనడంతో వర్షాకాలం రైతుబంధు ఇవ్వకుంటే రైతులు నష్టపోతారని బీఆర్ఎస్ పిలుపు మేరకు డిచ్‌పల్లి మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టి.. దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షులు నట్టబోజన్న, బీఆర్ఎస్ రైతుబంధు అధ్యక్షులు డికొండ శ్రీనివాస్, మండల మాజీ కోఆప్షన్ నెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్, మండల మాజీ సర్పంచ్ల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెండోరా : వర్షాకాలానికి రైతు భరోసా పోయినట్లేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన ప్రకటనపై బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగంపేట్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వివేకానంద చౌక్ దగ్గర రైతు భరోసాపై మంత్రి తుమ్మల వ్యాఖ్యలను నిరసిస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కమలాకర్, బిఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సబ్ జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలలో జిల్లా జట్టు ప్రథమ స్థానం

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 18 నుంచి 20 వరకు ఇన్ఫాంట్ జీసస్ హైస్కూల్ రెడ్డిపాలెం, వరంగల్ జిల్లాలో జరిగిన రాష్ట్ర సబ్-జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో జిల్లా బాలికల జట్టు ఫైనల్‌లో 05-04 పరుగుల తేడాతో విజయం సాధించి ప్రథమ బహుమతి సాధించినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్యుంటి గంగా మోహన్ తెలిపారు. 'రాష్ట్ర ఉత్తమ బ్యాటర్‌గా కీర్తన (సాంఘిక సంక్షేమ పాఠశాల పాఠశాల సుద్దపల్లి) అవార్డును సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి కే శోభన్ బాబు, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె నవీన్ కుమార్ ల చేతుల మీదుగా అందుకుంది. జిల్లా జట్టుకు కోచ్ మేనేజర్లుగా ఈ.నరేష్, సెంథిల్, బూల భాయ్, సౌమ్యరాణి వ్యవహరించారని వారు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్య దర్శి బొజ్జ మల్లేష్ గౌడ్, జిల్లా బేస్బాల్ సంఘం అధ్యక్షులు ఎల్ మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపా ధ్యక్షులు జైపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు మర్క ంటి సుజాత, చిప్ప నవీన్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు పి.నీరజారెడ్డి, కే సంగీతరావు, సునీత, జైడి రాజ్ కుమార్, పవన్ కుమార్, రాజేందర్, నాగభూషణం భూపతి, మధు, ఎస్.గంగాధర్, నాగేష్, సురేష్ హర్షం వ్యక్తం చేశారు.